క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్



ఏటూరునాగారం: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఏటూరునాగారం గ్రామానికి చెందిన గాడిచర్ల రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికచేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం శుక్రవారం తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చినందుకు అధ్యక్షుడు బలరాం, పార్టీ నాయకులు కృతజ్ఞతలను తెలిపారు.

అధ్యక్షుడిగా మల్లేష్



వెంకటాపురం(ఎం): బీజేపీ మండలాధ్యక్షుడిగా మండలంలోని కేశవపురం గ్రామానికి చెందిన పైడాకుల మల్లేష్‌ను జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం నియమించారు. తన నియామకానికి సహకరించిన నాయకులు జాడి వెంకట్, రవీంద్రాచారి, కృష్ణాకర్, కన్నె బోయిన వీరేందర్, రాజ్‌కుమార్, సంతోష్‌లకు మల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక




కిరణ్, అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి

ఏటూరునాగారం: టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొప్ప సమ్మారావు తెలిపారు. మండల అధ్యక్షుడిగా కిరణ్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను అండగా నిలబడి పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొడెం సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

19న ఇసుక డంపుల వేలం

కాటారం: కాటారం మండలం విలాసాగర్‌లో సీజ్ చేసిన ఇసుక డంపులను ఈ నెల 19న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా కోసం పలువురు ఇసుకను అక్రమంగా నిల్వచేశారనే సమాచారంతో ఇటీవల ఇసుక డంపులను సీజ్ చేసి జిల్లా మైనింగ్ అధికారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. దీంతో మైనింగ్ రాయల్టి ఇన్‌స్పెక్టర్ ఈ నెల 15న సీజ్ చేసిన ఇసుక డంపులను పరిశీలించి 393 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్లు నిర్ధారించారు. ఇసుకను వేలం వేసి వచ్చిన డబ్బులను ప్రభుత్వ ఖజానాలో జమచేయాలని సూచించినట్లు తెలిపారు. విలాసాగర్ గ్రామపంచాయతీ భవనం ఆవరణలో ఇసుక వేలం వేయనున్నట్లు ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని తహసీల్దార్ కోరారు.

బాధ్యతల స్వీకరణ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఎస్సైగా పీవీఎస్. భవానిసేన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మహదేవపూర్ 2వ ఎస్సైగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఉదయం ముందుగా శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ప్రశాంత్‌శర్మ ఆశీర్వచన వేదిక వద్ద కండువాతో సన్మానించి తీర్థప్రసాదం అందజేశారు.

సన్మానం



టేకుమట్ల: తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కనుమల్ల విజయలక్ష్మిని కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు వైనాల రవీందర్, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, మోతే రాజమౌళి, తోడేటి కుమార్, వెంకటరాజిరెడ్డి, కిరణ్‌రావు, రాకేష్, రెవెన్యూ సిబ్బంది డీటీ, భాస్కర్, ఆర్ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



మహాముత్తారం: మండల కేంద్రానికి చెందిన గావిడి వెంకటయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులను శుక్రవారం మహాముత్తారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి 25కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాటి లచ్చయ్య, లింగమల్ల దుర్గయ్య, శ్రీపతి శ్రీనివాస్, బైరవేని లక్ష్మయ్య, తడంల్ల మల్లయ్య, సిడం బక్కయ్య, తొర్రెం శ్రీను, సిడం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపాలి



చిట్యాల: మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న ఆశవర్కర్లు, నాయకులు

పలిమెల: రానున్న ఎన్నికల్లో కేంద్రంలో ఉన్న బీజేపీని గద్దె దింపాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పలు సంఘాల పిలుపునిచ్చిన దేశ వ్యాప్త సమ్మె పలిమెలలో ప్రశాంతంగా ముగిసింది. అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆదివాసీకరణ సంఘం, కేవీపీఎస్ నాయకులు, కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. మండల కేంద్రంలో పోలం రాజేందర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించితే తప్పా దేశానికి భవిష్యత్ ఉండదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సూదుల శంకర్, కేవీపీఎస్ మండల కార్యదర్శి పాగే పొట్టయ్య, ఆదిలక్ష్మి, నాగలక్ష్మి, అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

మల్హర్: ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని మండల ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా తలపెట్టిన గ్రామీణబంద్‌లో మండలంలోని తాడిచర్లలో ఆశలు శుక్రవారం ర్యాలీ నిర్వహించి, నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు పని భారం తగ్గించాలని, కార్మిక వర్గానికి నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాని, రిటైర్ అయ్యే కార్మికులకు రూ.10వేల పెన్షన్ అందించాలని కోరారు.



పలిమెల: నిరసన చేస్తున్న నాయకులు, సిబ్బంది



మల్హర్: ర్యాలీ నిర్వహిస్తున్న ఆశవర్కర్లు

చిట్యాల: ఆశ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం కనీస వేతనం అందించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజినీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆశ వర్కర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అయింది. కాని ఇప్పటి వరకు రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని అమలు చేయలేదన్నారు. అనంతరం మండల కేంద్రంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన కార్మిక సమ్మెకు మద్దతుగా దుకాణాలు బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్, ఆశ వర్కర్లు రాధిక, సాయివేద, సుమలత, లక్ష్మీ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని చల్వాయి గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. చల్వాయిలో ఇంటింటికి తిరుగుతూ 2023-24 విద్య సంవత్సరానికి గాను ఖాళీ సీట్ల భర్తీ కోసం ఉపాధ్యాయులు కాన్వాసింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చల్వాయి మోడల్ స్కూల్‌లో చాలా ప్రత్యేకతలు ఉన్నాయని, నిష్ణాతులైన అనుభవం కలిగిన అధ్యాపకులచే ఆంగ్ల మాధ్యమంలో ఉత్తమమైన విద్యాబోధన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్, ఉచిత మధ్యాహ్న భోజనం, తాగు నీరు కోసం మినరల్ వాటర్ ప్లాంట్ సౌకర్యం , ఉచిత హాస్టల్ వసతి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ టీచర్లు జీ.నిర్మల ఎం.స్వప్న, జె రమేష్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఏఈ హరిత

మల్హర్: వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూస్ ఏఈ హరిత అన్నారు. మండలంలోని మల్లారం గ్రామంలో వడ్డెర కాలనీ వాటర్ ట్యాంకు, మిషన్ భగీరథ లీకేజీలను హరిత శుక్రవారం పరిశీలించారు. రాబోయో వేసవిని దృష్టిలో పెట్టుకోని సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, గ్రామ స్థాయిలో చిన్నచిన్న లీకేజీ సమస్యలు ఉంటే సరిచేసుకోవాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, పంప్ ఆపరేటర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్యవాహనాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రేగొండ: మండలంలోని కొడవటంచ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా సూర్య వాహనసేవను గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామి వారికి ఆరగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, ఆలయ చైర్మన్ మాదాడి అనిత, ధర్మకర్తలు తిరుపతి, దేవేందర్, కుమారస్వామి, నాయకులు ములకనూరి భిక్షపతి, కరుణాకర్ రెడ్డి, సాంబయ్య, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం



కలపను స్వాధీనం చేసుకొని తరలిస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని బెజ్జంకి వేణుగోపాల్ అనే కార్పెంటర్ వద్ద అక్రమంగా నిల్వ ఉన్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఓ నరేందర్ తెలిపారు. డీఆర్ఓ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమ కలప ఉందని సమాచారం రావడంతో శుక్రవారం మండల కేంద్రంలోని ఓంకార్ వీధిలో కార్పెంటర్ వద్ద తనిఖీలు చేయగా రూ.80వేలు విలువ చేసే టేకు కలప లభించినట్లు పేర్కొన్నారు. దానిని రేంజ్ కార్యాలయం తరలించి సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీలో ఎఫ్‌బీఓ దయానంద్, రవికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు



జేసీబీతో గుంతలు తీయిస్తున్న ఎస్సై

ములుగుపల్లి: మండలంలోని వాగు శివారు గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేములపల్లి గ్రామ శివారులోని గునకపల్లి సైడ్ వాగులో అలాగే ఇస్సిపేట గ్రామ శివారు వాగొడ్డుపల్లి విలేజ్ పక్కన వాగుల శివారులలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా రోడ్డుకు అడ్డంగా గుంతలు తీయడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కులు అందించాలి



మాట్లాడుతున్న మల్లయ్య

చిట్యాల: గత ప్రభుత్వంలో వధువు తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్న కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం అందించి వారిని ఆదుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య కోరారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఎనమిది నెలల క్రితం వివాహం చేసుకున్న వధువు పేరిట వారి తల్లిదండ్రులు దరఖాస్తులు చేసుకోగ ఇంత వరకు చెక్కులు రాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రపు రాజేందర్, సరిగొమ్ముల రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ కోసమే ట్రస్ట్



పండ్లు, స్వీట్లు అందజేస్తున్న లక్ష్మీనారాయణ

మంగపేట: సమాజంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికోసం అన్ని రకాల సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రజాసేవ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు ట్రస్టు గౌరవ అధ్యక్షులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూరిబాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహణకు గాను ట్రస్టు వంతుగా నిర్వాహకురాలు కొమరగిరి సాంమ్రాజ్యంకు 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గుడివాడ శ్రీహరి, గౌరవ సలహాదారు గుండేటి రాజుయాదవ్, చల్లగురుగుల తిరుపతి, సాధనపల్లి కరివర్ధన్, గొని రమేష్, పిల్లలమర్రి వేణు, ముప్పారపు సందీప్, మూగల రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తి.. పోలీసులకు అప్పగింత

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని ఎల్‌బీనగర్‌లో గురువారం రాత్రి అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని కాలనీవాసులు పట్టుకోని పోలీసులకు అప్పగించారు. వరంగల్ ప్రాంతానికి చెందిన కడమంచి రాజు అనే వ్యక్తి అనుమానంగా అర్ధరాత్రి తిరుగుతూ కనిపిస్తూ కాలనీ వాసులను చూసి పారిపోతుండగా దొరకపట్టి పోలీసులకు సమాచారం అందించినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ మేరకు ఎస్సై సంధ్యారాణి అదుపులోకి తీసుకోని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మండలంలో పలు చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలకు ఏడాది పాటు జైలు శిక్షను విధిస్తూ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ రాంచంద్రరావు శుక్రవారం తీర్పును వెల్లడించారు. భూపాలపల్లి పట్టణంలోని ఎల్‌బీనగర్, మండలంలోని నాగారం గ్రామాల్లో 2018, 2022, 2023 సంవత్సరాల్లో జరిగిన మూడు దొంగతానాల్లో నేరస్తులైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ ప్రాంతానికి చెందిన విజయ్‌నారాయణ ముహార్లే, కాటారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన ఇనుముల అర్జయ్య ఇరువురు వేర్వేరుగా చోరీలకు పాల్పడ్డారు. ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రెండు వేల జరిమానా విధించారు.

బాలలతో పని చేయిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న రాజు

మల్హర్: బాలలతో పని చేయిస్తే చర్యలు తప్పవని మల్లారం కార్యాదర్శి రాజు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టు శివారులో నడుస్తున్న ఇసుక రీచ్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాల కార్మికులపై ఇసుక క్వారీ నిర్వాహకులకు, కార్మికులకు అవగాహన కల్పించారు. ఇసుక క్వారీ వద్ద బాలలను పనుల్లోకి తీసుకోవద్దన్నారు. వారితో పని చేపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అయోధ్యకు తరలిన రామభక్తులు



శోభాయాత్ర చేస్తున్న రామభక్తులు, నాయకులు

ములుగు రూరల్: అయోధ్య బాల రాముడి సన్నిధికి జిల్లాలోని రామభక్తులు తరలివెళ్లారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో అయోధ్యకు వెళ్లె భక్తులు, బీజేపీ నాయకులు శోభయాత్ర నిర్వహించారు. సీతారామాంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు గంద్రకోట కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జినుకల కృష్ణాకర్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి 195 మంది అయోధ్యకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 500 ఏళ్ల రామభక్తుల పోరాటానికి అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ఠతో హిందువుల చిరకాల వాంఛ నెరవేరిందని అన్నారు. భారతీయ సంస్కతి, సంప్రదాయాలు ప్రతి ఒక్కరూ కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరికొండ బలరాం, రవిరెడ్డి, సతీష్, కృష్ణ , శ్రీహరి, స్వరూప, ఇమ్మడి రమేష్, గాదం కుమార్, శోభన్, సాగర్, నాగరాజు, దేవేందర్, శ్రీనివాస్, ఒజ్జల లింగన్న, గట్టుమల్లు, ఓదెల రమేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడవిమార్గంలోని మేడారం రోడ్డు పరిశీలన



దారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్

ఏటూరునాగారం: మండలంలోని చెల్పాక, బన్నాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాల మీదుగా కొండాయి నుంచి మేడారం వెళ్లే రోడ్డును తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. మేడారం ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా ప్రైవేటు వాహనాలు వెళ్లేందుకు రూ.12 లక్షలు రోడ్ డ్యాం(తాత్కాలిక కల్వర్టు) నిర్మాణం చేపట్టే స్థలం, గ్రామంలో ఉన్న స్థితిగతులను ఆయన పరిశీలించారు. అంతేకాకుండా వాగు వస్తే వారు పడే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మేడారం జాతరకు ఈ మార్గంలో వాహనాలు ఎన్ని పోతాయని, ఎలాంటి ఇబ్బందులు ఉంటాయని ఆరా తీశారు. గ్రామస్తులకు తాగునీరు, విద్యుత్ సరఫరా, రేషన్, వైద్య సేవలు ఎలా అందుతున్నాయన్ని తెలుసుకున్నారు. గ్రామానికి హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు రమేష్, రవి తహసీల్దార్‌ను కోరారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ములుగుపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు విజయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఒక్క రోజు పాఠలు బోధించారు. డీఈఓగా సౌజన్య, ఎంఈఓగా కార్తిక్, ప్రధానోపాధ్యాయులుగా రాజుకుమార్, ఎస్ఎంసీ చైర్మన్‌గా గణేష్ వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, సురేందర్, కల్యాణి, అనిల్ కుమార్, కుమార్ స్వామి, ప్రవీణ్, లలిత, విజిత, రంగరాజు, శ్రీఖల, చందర్, స్పందన, సాంబయ్య పాల్గొన్నారు.

కరాటేతో విద్యార్థినులకు ఆత్మరక్షణ



కరాటే శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ బాలాజీ

ఏటూరునాగారం: కరాటేతో విద్యార్థినులకు ఆత్మరక్షణ కలుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో స్వయం రక్షణ తరగతులు (సెల్ఫ్ డిఫెన్స్ క్లాసెస్) నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె చిన్న ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో అమ్మాయిలపై జరుగుతున్న అత్యాచారాలను, అన్యాయాలను ఎదుర్కోవడానికి స్వయం రక్షణ తరగతులు జీవితంలో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కళాశాల అమ్మాయిలకు సమాజంలో జరిగే ఆగత్యాలను ఏ విధంగా ఎదుర్కోవాలో కొన్ని మెలికలను కరాటే, తైకాండో మాస్టర్ బాలాజీ నేర్పించారన్నారు. దాదాపు 100 మంది విద్యార్థినిలు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డా.ఎం విజయలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవీందర్, డాక్టర్ స్వామి, గణ్‌సింగ్, రమేష్, గన్సింగ్, నవీన్ ఫాతిమా, సంపత్, జ్యోతి పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న మారుతి

కాటారం: కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ నిరుపేద వృద్ధురాలికి ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి చేయూతనందించారు. మండలంలోని ఆదివారంపేట గ్రామానికి చెందిన ఆత్కూరి రామక్క రెండు సంవత్సరాలుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది. భర్త పదేళ్ల క్రితం చనిపోగా ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆస్పత్రికి వెళ్లలేక మంచానికే పరిమితమై ఉంటుంది. తినడానికి తిండి, ఉండటానికి సరైన ఇల్లు లేక ఇబ్బంది పడుతోంది. రామక్క దయనీయమైన పరిస్థితి తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిత్యావసర సరుకులు పంపించడంతో పాటు మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

'ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్ట్ అమానుషం'

కాటారం: జన్వాడలో క్రిస్టియన్ దళితులపై మతోన్మాద గూండాలు చేసిన దాడిలో గాయపడిన వారిని పరామర్శించడానికి వెళ్తున్న బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయడం అమానుషం అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజాబాబు మాట్లాడారు. బాధితుల్లో మనోధైర్యం నింపి భరోసా కల్పించడం కోసం వెళ్తున్న ప్రవీణ్‌కుమార్‌పై పోలీసులు, ప్రభుత్వ తీరు సరికాదన్నారు. మతోన్మాదులు కావాలనే దళితులను భయభ్రాంతులకు గురి చేయడంలో భాగంగా దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ క్రిస్టియన్లకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.